క్లుప్తంగా

కుష్ఠు నివారణకు కృషి చేయాలి


సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: కుష్ఠు వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పరీక్షలు చేయించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటాల(కె) గ్రామంలో కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్త రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ముగ్గురు ఎంపిక


గోపుల నాగచైతన్య

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన గోపుల నాగ చైతన్య అగ్నివీర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆర్మీ ఉద్యోగం సాధించాడు. దీంతో శుక్రవారం గ్రామస్తులు యువకుడిని అభినందించారు.

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బోథ్ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు అగ్నివీర్‌కు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకృష్ణ తెలిపారు. బీఎస్సీ బీజెడ్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఇట్టేవార్ రాజు, బీఏ ఫైనలియర్ విద్యార్థి శివనీత్ రాజులు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

చెట్ల పొదలు తొలగింపు


చెట్లపొదలు తొలగిస్తున్న సొసైటీ సభ్యులు

బోథ్: సొనాల మండల కేంద్రం నుంచి టీవీజీ, జీడిపల్లె గ్రామాలకు వెళ్లే దారి మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు, పొదలు పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సొనాలకు చెందిన నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు, గుబురు పొదలు తొలగించారు. సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయులు రడాపు మధుసూదన్, సొసైటీ అధ్యక్షుడు కొస్మెట్ శుద్దోదన్, శ్రీధర్, నాగరాజు, జంగు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న బసవేశ్వర్

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని గృహనిర్మాణ శాఖ పీడీ బసవేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పైలట్ ప్రాజెక్ట్ గ్రామం నవేగావ్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాల్లో మరింత వేగం పెంచాలన్నారు. ఎంపీడీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న తుల అరుణ్ కుమార్

బోథ్: సొనాల మండల ఎంపీడీవో రాజేశ్వర్‌ను ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కార్యాలయంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. సొనాల మండల మొదటి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నందున అభినందించారు. పీఏసీఎస్ డైరెక్టర్ లోలపు పోశెట్టి, తుల అజయ్, ముండే శ్రీధర్, హరిసింగ్, గంగాధర్, సుధీర్, బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు భోజన్న పాల్గొన్నారు.

‘జాదవ్ గోపాల్ సేవలు మరువలేనివి’

ఉట్నూర్‌రూరల్: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పాలనాధికారిగా జాదవ్ గోపాల్ అందించిన సేవలు మరువలేనివని జిల్లా ఇంటర్ విద్యాధికారి గణేశ్, పీజీహెచ్‌ఎం ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం చందన్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన మహోత్సవానికి హాజరయ్యారు.

నీటి వృథాకు చెక్

- కొత్తగా చెక్‌డ్యాంలు మంజూరు
- భూగర్భ జలాల పెంపే లక్ష్యం


ఎండిపోయిన కొత్త చెరువు


కొత్తగా నిర్మించిన చెక్‌డ్యాం

సిరికొండ: ఎండాకాలం మొదట్లోనే భూగర్భజలాలు అడుగంటి మండలంలోని చెరువులు, వాగులు, కుంటలు, బోరుబావులు ఎండిపోయాయి. దీంతో సాగు చేసిన పంటలకు రైతులు నీరు అందించలేని దుస్థితి నెలకొంది. కనీసం పశువులకు కూడ తాగేందుకు గుక్కెడు నీరు దొరకడం లేదు. నీరందక పంటలు ఎండిపోవడంతో కొందరు రైతులు పశువులకు మేతగా పంటలను వదిలేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ గడ్డు పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గ్రామాల్లోని వాగులు, కాలువలకు చెక్‌డ్యాంలు మంజూరు చేసింది.

అనావృష్టి.. అతివృష్టి..

మండలంలోని రైతులు వానాకాలంలో అతివృష్టితో, ఎండాకాలంలో అనావృష్టితో ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో భారీ వర్షాల వల్ల పంటలు నీటమునగడంతో పాటు వరదలకు నీరు వృథాగా సముద్రాల్లో కలుస్తోంది. ఎండాకాలంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. వాగుల్లో, బావుల్లో, బోరుబావుల్లో చుక్కనీరు లేకుండా ఆవిరై పంటలకు సాగు నీరు అందక రైతు కష్టం వృథాగా మారుతోంది.

వృథా పోకుండా..

వర్షాకాలంలో వృథాగా పోతున్న వరద నీటిని ఒడిసిపట్టాలని ప్రభుత్వం 8 చెక్‌డ్యాంలను మంజూరు చేసింది. ఈ చెక్‌డ్యాంలలో వరద నీటిని ఒడిసి పట్టేలా జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా సుమారు రూ.5 లక్షలతో మండలానికి 8 చెక్‌డ్యాంలు మంజూరు చేసింది. దీంతో మండలంలోని సిరికొండకు 4, మాల్లాపూర్ 1, నేరడిగోండ 1, వాయిపేట్‌కు 1, కన్నాపూర్‌కు 1 మంజూరయ్యాయి. ప్రస్తుతం సిరికొండలో గల ఒక చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి చేశారు.

చెక్‌డ్యాంలతో బహుళ ప్రయోజనాలు..

- చెక్‌డ్యాం నిర్మాణంతో వరద నీటిని వృథాగా పోకుండా అడ్డుకోవచ్చు.
- నిల్వ నీటిని పంటల సాగుకు వినియోగించవచ్చు.
- చెక్‌డ్యాంలతో సుమారు ఒక కిలోమీటర్ వరకు భూగర్భజలం పెరుగుతుంది.
- ఏడాదిలో అన్ని కాలాల్లో పశువులకు తాగడానికి నీరు ఉంటుంది.
- నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించి, భూమి కోతకు గురికాకుండా చేయొచ్చు.

అనేక ప్రయోజనాలు..



చెక్‌డ్యాంలను నిర్మించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రస్తుతం పంటలకు నీరు కూడా అందని పరిస్థితి ఉంది. ఎండిపోతున్న పంటలను చూస్తుంటే గుండె బరువెక్కుతుంది. చెక్‌డ్యాంలు నిర్మించి నీటి వృథాను అడ్డుకోవాలి.

– భీంరావు, ఈజీఎస్ ఏపీఎం

త్వరలో పూర్తి చేస్తాం



మండల కేంద్రంలో మంజూరైన 4 చెక్‌డ్యాంలల్లో ఇప్పటి వరకు సిరికొండ శివారులోని చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా మూడు చెక్‌డ్యాంల నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేస్తాం.

– స్వరూప, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్

ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని వినతి


మంత్రి వెంకట్‌రెడ్డికి విన్నవిస్తున్న అరుణ్ కుమార్

బోథ్: నియోజకవర్గ కేంద్రంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం కలిసి విన్నవించారు. నిజాం కాలంలో నిర్మించిన ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకుందని మంత్రికి తెలిపారు. భవన నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి భవనం నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ సీఈని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో విస్తరణ ఉపన్యాసం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తరణ ఉపన్యాసం ఏర్పాటు చేశారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల అధ్యాపకులు పుట్ట రవి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భౌతికశాస్త్రంలో ఆధునిక పోకడలు అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, భౌతికశాస్త్ర విభాగాధిపతి రమాకాంత్ గౌడ్, అధ్యాపకులు రవి కిరణ్, అరుణ్ కుమార్, నంద కుమార్, వెంకటేశ్, అష్రఫ్‌అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బజార్‌హత్నూర్: నేటి యువత సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సోషల్ మీడియా, మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగే ప్రమాదాన్ని వివరించారు. షీటీం కోఆర్డినేటర్ సుశీల, పోక్సో చట్టం, మహిళ భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై అప్పారావు, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, షీటీమ్ సభ్యులు వాణిశ్రీ, కిషన్, సత్యనారాయణ, సౌజన్య పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

ఇంద్రవెల్లి: వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లు, 2024కు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలు శాంతియుతంగా నిరసన తెలిపారు. చేతులకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీల శాంతియుత నిరసన

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా మండలంలోని ఆల్‌ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం మైనార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బైక్ దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసిన నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో పార్కింగ్‌లో ఉన్న బైక్ గురువారం చోరీకి గురైంది. కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ నదీమ్ ఈ ద్విచక్ర వాహనం చోరీ చేయగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతినగర్‌కు చెందిన ఎన్నాల రాకేశ్, భుక్తాపూర్‌కు చెందిన చంద్రబోది మాస్కిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో తిరుగుతుండగా పట్టుకొని విచారించగా వారి వద్ద నుంచి 20 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తప్పుడు పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు చేసి మతాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పట్టణానికి చెందిన గంద్రత్ సంతోష్ అనే వ్యక్తి ఓ వర్గానికి చెందిన వ్యక్తులు తనపై దాడి చేసేందుకు యత్నిస్తున్నారని, విద్యానగర్‌లోని హనుమాన్ మందిరంలో తలదాచుకున్నానని, తనను రక్షించేందుకు అందరూ రావాలని సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన పలువురు అక్కడికి వచ్చారు. పోలీసులకు సమాచారం రావడంతో వన్‌టౌన్, టూటౌన్ ఎస్సై సునీల్‌కుమార్, కరుణాకర్‌రావు, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. విద్యానగర్ ప్రాంతంలో ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఫోన్‌ట్రాక్ చేయగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని ఓ హోటల్ ఉన్నట్లు తెలిసింది. మతాల మధ్య రెచ్చగొట్టేలా పోస్టు చేసి ప్రజలను భయాభ్రాంతులకు గురి చేసేలా ప్రవర్తించిన ఆయనపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8వ షెడ్యూల్‌లో పొందుపర్చడం హర్షణీయం

నార్నూర్: బంజారా (లంబాడా) గోర్‌బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పొందుపర్చుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారత్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మాట్లాడారు. బంజారా గిరిజనుల ప్రత్యేకమైన వేషాధారణ, భాష ఉన్నప్పటికీ లిపి లేక పోవడంతో గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో కళా కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడే డిగాంబర్, ఉట్నూర్ నాయక్ గంగారాం నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు ఆవిర్భావ వేడుకలు

ఇచ్చోడ: మండలంలోని ముఖరాకే లో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ముందస్తు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంట పొలాల్లో మాజీ సీఎం కేసీఆర్ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మరమ్మతులు చేపట్టాలని వినతి

బోథ్: సొనాల గ్రామంలోని ప్రయాణ ప్రాంగణంలో మరమ్మతులు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు ఎంపీవో అతుల్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణలకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సోమన్న, అమృత్‌రావు, భోజన్న, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

బోథ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను తప్పుపడుతూ ఏఐసీసీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు ఇచ్చోడలో సన్నాహక కార్యక్రమాన్ని శనివారం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ‘జైబాపు జైభీమ్ జైసంవిధాన్’

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ తెలిపారు. శుక్రవారం ఇచ్చోడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ కార్యదర్శి జనక్ ప్రసాద్ రానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, దూట రాజేశ్వర్, ఖయ్యూం, లాజర్, మర్సుకోల తిరుపతి, జగదీప్, కళావతి, దేవానందం, రాజమణి, ప్రభాకార్, భాస్కర్, సలీం తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వామన్‌రావ్ దేశ్ పాండే, కార్యదర్శిగా పంద్రం శంకర్, ఉపాధ్యక్షుడిగా ధమ్మపాల్, జాయింట్ సెక్రటరీగా కుమ్మరి విజయ్ కుమార్, కోశాధికారిగా ఆడెపు హరీశ్, స్పోర్ట్స్ సెక్రటరీగా వివేక్ సింగ్, మహిళ ప్రతినిధిగా గంగసాగర్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎట్టల రాములు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పిప్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్నారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధించాలన్నారు. డీఈవో ప్రణీత, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, రాజారాం, లక్ష్మణ్, ప్రభాకర్, సతీశ్, సకేష్, మారుతి, సాయిచైతన్య, అరుణ్, ప్రభు, లింగారెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణంతో మెరుగైన వసతులు..

ఇచ్చోడ: మండల కేంద్రంలో రూ.16 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం శివాజీ చౌక్, నిర్మల్, ఆదిలాబాద్ బైపాస్‌ల వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఏఈ అరవింద్, నాయకులు ప్రీతంరెడ్డి, పాండురంగ్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ పరిశీలన..

బోథ్: బోథ్ బస్టాండ్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో, బస్సులోని ప్రయాణికులతో ముచ్చటించారు. ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ పనులను పరిశీలించారు. ప్రసాద్ ఆసుపత్రితో పాటు పార్టీ కార్యకర్త ప్రవీణ్ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, ప్రవీణ్ కుమార్, ఎలుక రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే..

మండల కేంద్రంలోని జామా మసీదులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి..

సిరికొండ: మండల కేంద్రంలోని జామ మసీదు పనులకు రూ.5లక్షలు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల బీఆర్‌ఎస్ నాయకులు నేరడిగొండలోని ఆయన నివాసంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నాయకులు పెంటన్న, ఇక్బాల్, తోకల చందు పాల్గొన్నారు.

హీరాసుక జెండా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న పర్ధాన్ సమాజ్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కులగురువు, గొండి ధర్మగురు హీరాసుక జెండా తొలగించి, దహనం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పర్ధాన్ సమాజ్ పెద్దలు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హీరాసుక జెండా తొలగించడంతో శుక్రవారం ఉదయం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని తొలగించిన హీరాసుక జెండాను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పర్ధాన్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గ నగేశ్, జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్, మెస్రం శంకర్, పర్ధాన్ సంఘం నాయకులు, కేస్లాపూర్ గ్రామస్తులు ఆర్క ఖమ్ము, పెందోర్ అంకుష్, మెస్రం శేషనారాయణ్, తోడసం శాంత్‌రాజ్, మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మెస్రం ఆనంద్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, గేడం భరత్, సోయం మురహరి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాల సందర్శన

సిరికొండ: మండలంలోని రాంపూర్‌గూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో సునీల్ సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యయుడు చౌహాన్ నరేశ్, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఉన్నారు.

శుద్ధజల యంత్రం ప్రారంభం

తలమడుగు: పాఠశాలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుద్ధజల యంత్రం అందించడం అభినందనీయమని ఎంఈవో వెంకట్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ పాఠశాలలో శుద్ధజల యంత్రాన్ని ప్రారంభించారు. దేవారెడ్డి, హెచ్‌ఎం జ్యోతి, జైభారత్ రెడ్డి, గంగన్న, కిరణ్ కుమార్, సంతోష్, కమలాకర్, రాములు, చందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలి

బోథ్: ప్రతీ వర్షపు బొట్టును ఒడిసి పట్టుకోవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రఘునాథ్‌పూర్, కండిపల్లె, అందూర్, నారాయణపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో నీటి వనరులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించారు. బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

దశాబ్దాల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

తాంసి: మందకృష్ణ మాదిగ దశాబ్దాల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడల స్వామి అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలో కొమురంభీమ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దర్శనాల పోచన్న మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవాల్లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్‌మాదిగ, పెద్దింటి అశోక్ మాదిగ, కడదారపు ఆశన్న మాదిగ, ప్రభాకర్, శ్రీనివాస్, గౌతమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమాస్తాల కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ న్యాయవాదుల గుమస్తా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కోర్టు ప్రాంగణంలోని సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నోముల గణేశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మామిడాల దశరథ్, ఉపాధ్యక్షుడిగా కిషన్, కోశాధికారిగా తెడ్డోజి రాకేశ్, సంయుక్త కార్యదర్శిగా మోత్కుల ఆకాశ్‌యాదవ్, క్రీడా కార్యదర్శిగా గోనె అనిల్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

నేరడిగొండ: అర్హులందరికీ రేషన్ కార్డుల మంజూరుకు కృషి చేస్తున్నామని ఆర్ఐ నాగోరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారం గ్రామంలో రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన వారి ఇంటింటికీ వెళ్లారు. జాబితాను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ శంకర్, జూనియర్ అసిస్టెంట్ రాజారామ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రంలో గత మూడు నెలల క్రితం అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద మంజూరైన రూ.3లక్షల 75వేల చెక్కును శుక్రవారం తహసీల్దార్ కవితా రెడ్డి బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. రెవెన్యూ ఆర్ఐ అరుణ్ కుమార్ ఉన్నారు.

‘ధ్రువపత్రాలు అందజేయాలి’

బోథ్: రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ ధ్రువపత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. కాగా శుక్రవారం దరఖాస్తుదారులు ఎంపీడీవోకు ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తులు అందజేశారు.

ఇఫ్తార్ ఏర్పాటు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని నూర్ మసీదు వద్ద శుక్రవారం ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, అక్తర్, వసీం, మూర్తజ, ఇమ్రాన్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని మదీనా మసీదు ప్రాంగణంలో శుక్రవారం రాత్రి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ముస్లింలతో కలిసి పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

30న ఉగాది వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: విశ్వవసునామ సంవత్సర ఉగాది వేడుకలను ఈనెల 30న పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పంచాంగశ్రావణం, 1గంటకు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.